# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-04-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు జిల్లాలో అన్న క్యాంటీన్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభిస్తారు.**
2. **లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు ఈరోజు విడుదల కానున్నాయి.**
4. **రాయలసీమ అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు.**
5. **విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, మౌలిక వసతుల కల్పన అత్యంత అవసరమని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

=========================

ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు జిల్లాలో అన్న క్యాంటీన్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభిస్తారు. ఇప్పటి వరకూ 207 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం, రెండో విడతగా గ్రామీణ ప్రాంతాల్లోనూ 62 క్యాంటీన్లను ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో గ్రామీణ అన్న క్యాంటీన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించి అనంతరం లబ్ధిదారులతో కలిసి భోజనం చేయనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అధికారులు తెలిపారు. అన్న క్యాంటీన్ల ద్వారా 5 రూపాయలకు ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు.

-------------------------

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌లకు ఆయన లేఖలు రాశారు. ఈ అంశంపై దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసికట్టుగా ఉండాలని పేర్కొన్నారు.

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ రోజు ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్‌రెడ్డి రేపు ప్రమాణ స్వీకారం చేయనుండగా.. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. అలాగే రేపటి నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు కూడా ప్రారంభం కానున్న నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ల

బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్విభజన బిల్లును కూడా ప్రవేశపెట్టనుండడంతో..రెండు రోజుల పాటు ఢిల్లీలోనే ఉంటారని అధికారులు తెలిపారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్‌ను అఖిల భారత బంజారా సేవా సంఘ్ ప్రతినిధులు నిన్న మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో గిరిజన ప్రాంతాల్లోని వివిధ సమస్యలపై ఉపముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారు. అలాగే నాన్ షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని గిరిజన ఆవాసాల్లో పల్లె పండుగ, సాస్కి వంటి కార్యక్రమాల కింద సౌకర్యాలు కల్పిస్తున్నందుకు వారు పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాన్ షెడ్యూల్డ్ గిరిజన ఆవాసాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు తీసుకువెళ్తామని ఉపముఖ్యమంత్రి తెలిపారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు ఈరోజు విడుదల కానున్నాయి. ఈమేరకు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నిన్న వెల్లడించారు. ఈ రోజు ఉదయం 10 గంటల 30 నిమిషాల నుంచి ఫలితాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు resultsbie.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా, లేదా 9552300009 వాట్సప్ నెంబర్ ద్వారా ఫలితాన్ని తెలుసుకోవచ్చని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫిబ్రవరి 23 వ తేదీ నుంచి మార్చి 23 వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరిగాయి.

----------------------------

రాయలసీమ అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, హంద్రీనీవా వంటి కీలక ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యమని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. అనంతపురంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడారు. రాయలసీమలో నీటి ప్రాజెక్టుల కోసం 40 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వీటిని పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

----------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉర్దూ కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు, గ్రంథాలయాల ఆధునీకరణకు చర్యలు చేపట్టినట్లు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. మొత్తం 2.75 కోట్ల రూపాయల వ్యయంతో 36 కేంద్రాల్లో 216 కంప్యూటర్లతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి నిన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కేంద్రాల్లో కృత్రిమ మేధ, సైబర్ నెట్‌వర్కింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, జావా, పైతాన్ వంటి కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మైనారిటీ యువతకు మెరుగైన భవిష్యత్తు కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు.

----------------------------

సౌరశక్తి వినియోగం ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవడమే కాకుండా విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోగలమని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాలోని నాతవరంలో ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్లను మంత్రి అనితతో కలిసి నిన్న ప్రారంభించారు. అనంతరం అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, నియోజకవర్గంలో 2 వేలకుపైగా ఎస్సీ, ఎస్టీల గృహాల్లో సోలార్ యూనిట్లను ఉచితంగా ఏర్పాటు చేశామన్నారు. వారు వాడుకోగా మిగిలిన విద్యుత్తు ఏపీ ట్రాన్స్ కో తీసుకొని గృహ వినియోగదారులకు బిల్లు

చెల్లిస్తుందన్నారు. అనంతరం హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో మత్తు పదార్థాల రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని త్వరలో పూర్తిగా నియంత్రిస్తామని పేర్కొన్నారు.

---------------------------

ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, మౌలిక వసతుల కల్పన అత్యంత అవసరమని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మార్కెట్ యార్డ్‌లో సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు మంత్రి నిన్న సైకిళ్లను పంపిణీ చేశారు. అనంతరం సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాల విద్యార్థుల అవసరాలను గుర్తించి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. సివిల్స్ కోచింగ్, బ్యాంకింగ్, ఇతర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

రాజకీయ నిర్ణయాల్లో మహిళలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ తెలిపారు. విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించిన "మహిళా రిజర్వేషన్‌పై నిపుణుల చర్చ" కార్యక్రమంలో ఆమె నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ, మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం అవసరమని అందుకు మహిళా రిజర్వేషన్ బిల్లు దోహదపడుతుందని అన్నారు. ప్రస్తుతం మహిళల ఓటింగ్ శాతం పెరుగుతోందని, మహిళలు అవకాశాలను అందిపుచ్చుకుని నిర్ణయాధికారంలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష-టెట్ కు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ఈ రోజు నుంచి ప్రారంభమవుతుంది. అభ్యర్థులు ఈరోజు నుంచి ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ పరీక్షలను జూన్ 15 నుంచి 30వ తేదీ మధ్య తెలంగాణ విద్యాశాఖ నిర్వహించనుంది. దరఖాస్తులను www.scooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా సమర్పించాలని పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

---------------------------

రానున్న మూడు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్టలో నిన్న 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు వెల్లడించింది. 262 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపింది. రాయలసీమ, కోస్తా జిల్లాల్లో 42 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

తెలంగాణలో పలు చోట్ల 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్‌తోపాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, హైదరాబాద్ జిల్లాలలో వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణశాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

=====================